ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

మంగళవారం 4 ఫిబ్రవరి 2025

నేడు నిజరూప దర్శనం

మంగళవారం ఉదయం నుంచి ఆదిత్యుడు నిజరూపంలో భక్తులకు దర్శనమిస్తారు. సాయంత్రం విశేష పుష్పాలంకరణ సేవ ఉంటుంది. నిజరూప దర్శనానికి భక్తులు భారీగా తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసింది. ఆలయం వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా ఆలయం వెనుక భాగం నుంచి వాహనాలు వచ్చేలా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఏర్పాట్లను ఎప్పటికప్పుడు కేంద్ర,రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ పర్యవేక్షిస్తున్నారు.



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన



ఆదిత్యుడి ఆలయానికి పూలతో అలంకరణ..



ఓం నమో సూర్యాయ

- అర్ధరాత్రి నుంచి ఆరంభమైన క్షీరాభిషేకం
- రథసప్తమి వేడుకకు భారీగా భక్తుల రాక
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీకాకుళం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం.. అరసవల్లిలోని శ్రీ సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలు ఉత్సాహంగా సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం 'రథసప్తమి'ని రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో ఈసారి ప్రత్యేకత సంతరించుకుంది. ఆదివారం నుంచి ఈ ప్రారంభమైన ఈ వేడుకలు.. సోమవారం కూడా కొనసాగాయి. రాష్ట్రస్థాయి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు ఆకట్టుకున్నాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి కీలక ఘట్టం.. ఆదిత్యుడికి క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. దేవదాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి వినయ్‌చంద్ పట్టువస్త్రాలను స్వామికి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని.. సూర్య మంత్రాన్ని స్మరించారు. ఆలయ ఆవరణ అంతటా 'ఓం నమో భగవతే సూర్యాయ' నామస్మరణ మార్మోగింది. ఓ వైపు దట్టంగా పొగమంచు కురుస్తున్నా.. అధిక సంఖ్యలో భక్తులు సోమవారం రాత్రి (మిగతా 6వ పేజీలో..)

సర్వాంగ సుందరంగా ఆదిత్యాలయం

అరసవల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేళ.. అరసవల్లిలో ఆదిత్యాలయాన్ని సర్వాంగ సుందరంగా తీరిదిద్దారు. అనివెట్టి మండపాన్ని రంగురంగుల పూలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఆవరణంలో ఆకర్షణీయమైన టెంట్లు వేశారు. స్నానాలకు అనువుగా ఇంద్ర పుష్కరిణిలో నీటిని నింపారు. భక్తులకు ఆహ్లాదాన్ని పంచేలా ఆలయానికి ఎదురుగా, ఇంద్రపుష్కరిణికి ఇరువైపులా రకరకాల పూలమొక్కలను ఉంచారు. ఆలయ సింహద్వారం నుంచి అరసవల్లి మిల్లు జంక్షన్ వరకు రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. సోమవారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సమన్వయంతో పనిచేయాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

6లో





పాటలతో హుషారెత్తిస్తున్న గాయని మంగ్లీ.. తిలకిస్తున్న ప్రజలు



సోమవారం అర్ధరాత్రి క్యూలో భక్తుల నిరీక్షణ



శ్రీకాకుళం రోడ్ రైల్వేకి మహర్దశ

- అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి
- సిక్కోలు మీదుగా మరిన్ని వందే భారత్ రైళ్లు
- రైల్వే బడ్జెట్‌లో ప్రాధాన్యంపై సర్వత్రా హర్షం

శ్రీకాకుళం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వం కేంద్రం.. రాష్ట్రంలో కొలువు తీరడంతో రైల్వే లోనూ జిల్లాకు ప్రాధాన్యం లభించింది. శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వే స్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. జిల్లా మీదుగా మరిన్ని వందే భారత్ రైళ్లు కూడా నడవనున్నాయి. కేంద్ర ప్రభుత్వం సోమవారం రైల్వే బడ్జెట్‌ను ప్రకటించింది. అందులో ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే పరంగా కేటాయించిన నిధులు.. చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వెల్లడించింది. ఈ మేరకు అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా శ్రీకాకుళం రోడ్‌తోపాటు.. ఇతర రైల్వే స్టేషన్లను ఆధునికీకరించేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఇప్పటికే ఈ పథకం అమల్లో ఉంది. మరింత విస్తరణ (మిగతా 8వ పేజీలో..)



కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కేన్సర్ కలవరం

- చాలామందిలో బయటపడుతున్న లక్షణాలు
- స్ర్కీనింగ్ పరీక్షలు ద్వారా గుర్తింపు
- జిల్లాకొక ఆస్పత్రి ఏర్పాటుకు కేంద్రం చర్యలు
- అవగాహనతోనే నివారణ సాధ్యమంటున్న నిపుణులు

నేడు ప్రపంచ కేన్సర్ దినం

నరసన్నపేట పట్టణానికి చెందిన ఒక వ్యాపారి కొద్ది రోజులుగా కేన్సర్‌తో బాధపడుతున్నారు. సంతబొమ్మాళి మండలానికి చెందిన ఒక వ్యక్తి కేన్సర్‌తో బాధపడుతూ గత నెల 26న మృతిచెందారు. అలాగే నరసన్నపేటకు చెందిన మరొకరు కేన్సర్ సోకిందని కలత చెంది.. ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇలా జిల్లాలో కేన్సర్ బారిన పడి చాలామంది చికిత్స పొందుతుండగా.. మరికొందరు ప్రాణాలు కోల్పోతున్నారు.

నరసన్నపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కేన్సర్ వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోంది. కేన్సర్ నివారణ కోసం ప్రభుత్వం.. 'కేన్సర్ స్ర్కీనింగ్ శిక్షణ' పేరిట 18 ఏళ్లు దాటినవారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తోంది. గతేడాది నవంబరు 14 నుంచి జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో సుమారు 18,20,000 మందికి స్ర్కీనింగ్ పరీక్షలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లావ్యాప్తంగా 84 పీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రి, సీహెచ్‌సీల పరిధిలో ఇప్పటివరకు సుమారు 3 లక్షలు మందికి స్ర్కీనింగ్ పరీక్షలు చేశారు. ఇందులో 3,151 మందికి కేన్సర్ అనుమానిత లక్షణాలు ఉన్నట్లు క్షేత్రస్థాయి పరీక్షల్లో వైద్యసిబ్బంది తేల్చారు. కేన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతుండడంతో జిల్లావాసుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోనే అధికంగా కేన్సర్ లక్షణాలు బయటపడుతున్నాయి. కవిటి మండలం మాణిక్యపురం పీహెచ్‌సీ పరిధిలో 128 మందికి నోటి కేన్సర్, 16 మందికి రొమ్ము కేన్సర్, 21 మందికి సర్వైకల్ కేన్సర్ ఉన్నట్టు తేలింది. ఆమదాలవలస మండలం పురుషోత్తపురం పీహెచ్‌సీ పరిధిలో 26 మందికి నోటి కేన్సర్, 27 మందికి రొమ్ము, 16 మందికి సర్వైకల్ కేన్సర్ లక్షణాలు ఉన్నాయి. రెంటికోట పీహెచ్‌సీలో మందికి నోటి, 12 మందికి రొమ్ము, 16 మందికి సర్వైకల్ (మిగతా 8వ పేజీలో..)



ప్రతి ఒక్కరికీ స్ర్కీనింగ్

ప్రభుత్వ నిర్ణయం మేరకు జిల్లాలో 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో సుమారు 18.20 లక్షల మందికి స్ర్కీనింగ్ పరీక్షలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించాం. ఇప్పటి వరకు సుమారు 2.5లక్షల మందికి పరీక్షలు నిర్వహించాం. అందులో అనుమానిత లక్షణాలు ఉన్నవారందరిని సంబంధిత డాక్టర్ల వద్దకు పంపించి మళ్లీ పరీక్షలు చేయిస్తాం.

- డా.ఇప్పిలి వెంకటరావు, ప్రోగ్రాం అధికారి



నానుబాలవారివీధిలో విజయదుర్గమ్మకు జ్ఞాన సరస్వతిగా అలంకరణ

సరస్వతీ.. నమస్తుభ్యం

- ఘనంగా సామూహిక అక్షరాభ్యాసాలు

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వసంత పంచమిని పురస్కరించుకుని.. జిల్లాలో సామూహిక అక్షరాభ్యాసాలు ఘనంగా నిర్వహించారు. పీఎన్ కాలనీలోని వరసిద్ధి వినాయక పంచాయతన ఆలయంలో సుమారు 700 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. పలక, బలపం, పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ముందు గా జ్ఞాన సరస్వతిదేవి వద్ద పూజలు నిర్వహించారు. అలాగే నానుబాలవారివీధిలోని విజ యదుర్గమ్మను సరస్వతీదేవీగా అలంకరించారు. విజయగణపతి, బాకర్‌సాహెబ్‌పేటలోని దుర్గా మహాలక్ష్మి, వేణుగోపాల స్వామి ఆలయాల్లో కూడా వసంత పంచమి వేడుకలు నిర్వహించారు.



శ్రీకాకుళం: వరసిద్ధి వినాయక ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు



ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో పనులు పరిశీలిస్తున్న జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్

పనులు వేగవంతం చేయండి

7లో

- స్టేషన్లలో సమస్యల పరిష్కారానికి కృషి: ఈస్ట్‌కోస్టు రైల్వే జీఎం పరమేశ్వర్ ఫక్వాల్

స్వరూపం కోల్పోతున్న గెడ్డలు

- రైతులకు తప్పని ఇబ్బందులు

8లో

కాలువలో కానరాని సాగునీరు

సమష్టిగా గ్రామాల అభివృద్ధి

- సంక్షేమ పథకాల అమలులో రాజీ లేదు
- మంత్రి అచ్చెన్నాయుడు

8లో

నదీ సంగమ స్నానం.. పరమ పవిత్రం

- నేడు బారువకు తరలిరానున్న భక్తులు
- ఏటా సూర్యోదయ సమయాన స్నానాలు



బారువ తీరంలో స్నానమాచరిస్తున్న భక్తులు (ఫైల్)

సోంపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రథసప్తమి రోజున సూర్యోదయ సమయంలో బారువ తీరంలోని మహేంద్ర తనయ నదీ సంగమ స్థానంలో స్నానం చేస్తే పాపాలు పోతాయనేది భక్తుల నమ్మకం. దీంతో రథసప్తమి రోజున సోంపేట చుట్టు పక్కలతో పాటు ఒడిశా నుంచి కూడా స్నానాలకు బారులు తీరుతారు. ముందురోజు రాత్రే బారువ సముద్ర తీరానికి చేరుకొని సూర్యోదయం సమయంలో స్నానం ఆచరించి ఆదిత్యునికి పూజలు చేస్తారు. నదీ స్నానం అనంతరం బారువలో ఉన్న ప్రాచీన కోటి లింగేశ్వర, జగన్నాథ స్వామి ఆలయాలను దర్శించుకుంటారు.

సాగర సంగమ ప్రత్యేకత ఇదీ

పూర్వం పాండవులు మహేంద్రగిరుల్లో అరణ్యవాసం చేస్తున్న సమయంలో అనుకోకుండా అర్జునుడు వదిలిన బాణం తగిలి గోవు మృతి చెందుతుంది. ఆ గోవు గర్భం నుంచి రాలిన ఒకటి తక్కువ కోటి రక్తపు చుక్కలే బారువలో పడి శివ లింగాలుగా ఏర్పడ్డాయని.. అదే ఇక్కడి కోటి లింగేశ్వరాలయమని పెద్దలు చెబుతారు. గో హత్య అనంతరం తీవ్ర మనస్థాపానికి గురైన అర్జునుడు శ్రీకృష్ణుడిని వేడుకోగా.. బహుళ చతుర్థి... శ్రవణం నక్షత్రం కలిసిన రోజున నదీ, సాగర సంగమంలో స్నానమాచరించి.. శివాలయాన్ని దర్శించుకుంటే చేసిన పాపం హరించుకుపోవడమే కాకుండా జన్మ రాహిత్యం పొందుతారని చెప్పారని ప్రతీతి. శ్రీకృష్ణుడి ఉపదేశంతో అర్జునుడితో సహా పాండవులు బారువ తీరంలో సముద్ర స్నానమాచరించి.... కోటి లింగేశ్వరాలయాన్ని దర్శించుకున్నారని స్థానికుల నమ్మకం. దీంతో పాటు ఏటా రథ సప్తమి పర్వదినం రోజున భక్తులు బారువ తీరంలో సముద్ర స్నానాలు చేసి, ఇక్కడి ప్రాచీన ఆలయాలను దర్శించుకుంటుంటారు.

ప్రాచీన ఆలయాల క్షేత్రం

పవిత్రమైన నదీ సాగర సంగమానికే కాకుండా బారువ తీరం ప్రాచీన ఆలయాలకు ప్రసిద్ధి చెందింది. ముఖ్యంగా దక్షిణ కాశీగా పేరుగాంచిన కోటి లింగేశ్వర, పురాతన జగన్నాథ స్వామి ఆలయాలతో పాటు విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణ దేవరాయలు దర్శించిన జనార్దన స్వామి ఆలయం ఇక్కడ ఉన్నాయి. వీటితో పాటు బీచ్ రోడ్డులో కనక దుర్గా ఆలయం భక్తులను ఆకర్షిస్తోంది.

టెక్కలిలోనూ ఆదిత్యునికి పూజలు

- జిల్లాలో రెండో సూర్యనారాయణ స్వామి ఆలయం
- నిజరూప దర్శనం ప్రారంభం

టెక్కలి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత ఆదిత్యుడి ఆలయం పేరు చెబితే జిల్లాలోని అరసవల్లి క్షేత్రం గుర్తుకు వస్తుంది. దీంతో పాటు టెక్కలి పాత జాతీయ రహదారిపైనా సూర్యనారాయణ స్వామి ఆలయం ఉంది. ఇక్కడ కూడా రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తారు. ఆంధ్రా, ఒడిశాల నుంచి పెద్దఎత్తున భక్తులు ఈ ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. నాలుగున్నర దశాబ్దాల కిందట బొంగు సూర్యనారాయణ అనే కవి, రచయిత, ఉపాధ్యాయుడు ఈ ఆలయాన్ని నిర్మించారు. ఏటా ఈ ఆలయంలో రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా భక్తుల కోసం క్యూలైన్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. సోమవారం అర్ధరాత్రి తర్వాత సూర్యనారాయణ స్వామికి క్షీరాభిషేకం చేశారు. ఆదిత్యునికి ప్రత్యేక పూజలు చేసిన తరువాత భక్తులకు సర్వదర్శనం కల్పించారు. రథసప్తమి నాడు స్వామి వారి విగ్రహాలకు సూర్యకిరణాలు తాకుతాయని అర్చకులు చెబుతున్నారు.



టెక్కలిలోని సూర్య దేవాలయం



సూర్యభగవానుడి మూలవిరాట్

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో విజయనగరం

- ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం
- హోరాహోరీగా రథసప్తమి క్రీడాపోటీలు



శ్రీకాకుళం జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏడు రోడ్ల కూడలిలో గల ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో గత రెండు రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో విజయనగరం జట్టు విజేతగా నిలిచింది. రథసప్తమి వేడుకల్లో భాగంగా ఈ పోటీలు నిర్వ హించారు. సోమవారం నిర్వహించిన ఫైనల్స్‌లో తొలి సెట్‌లో శ్రీకాకుళం జట్టు 23-25 స్కోర్‌తో ముందంజ వేయగా.. తర్వాత రెండు సెట్స్‌లో 25-16, 15-10 స్కోర్‌తో వెనకబడింది. దీంతో విజయనగరం జట్టు విజేతగా నిలిచింది. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఈ పోటీలు నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌ను ఎమ్మెల్యే గొండు శంకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తిలకించారు. దీంతో పాటు గ్రామీణ క్రీడలైన వెయిట్ లిఫ్టింగ్, కర్ర సాము, ఇసురు గుండు, పిల్లి మొగ్గలు, 160 కేజీల ఉలవల బస్తా, ఈడుపు సంగిడీ, తీట సంగిడీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీడాకారులం దరికీ నగదుతో పాటు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, జిల్లా ఒలింపిక్ సంఘం ముఖ్య సలహాదారు పి.సుందరరావు, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా పీఈటీ, పీడీల సంఘ అధ్యక్షుడు ఎంవీ రమణ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, శిక్షకులు హరికృష్ణ, ఎం.మాధురీలత, అర్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం, విజయనగరం జట్ల మధ్య మ్యాచ్

సాంస్కృతిక శోభ

- ప్రధాన ఆకర్షణగా గాయని మంగ్లీ గీతాలు
- అలరించిన నృత్య ప్రదర్శనలు



శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రథ సప్తమి వేడుకల్లో భాగంగా రెండో రోజు సోమవారం శ్రీకాకుళంలో సుందరంపల్లి శ్రీనివాస్ శాక్సాఫోన్ కచేరీ, సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో బుర్రకథను ప్రదర్శించారు. మావుడూరు సత్యనారాయణ ఆధ్వర్యంలో శాస్త్రీయ సంగీత కచేరీ ఏర్పాటు చేశారు. నగరానికి చెందిన నీరజా సుబ్రహ్మణ్యం శిష్య బృందం శ్రీనివాస కల్యాణం నృత్య రూపకం, ఆదిత్య అష్టకం, దేవీస్తుతి నృత్య రూపకాలను ప్రదర్శించారు. రఘుపాత్రుని శ్రీకాంత్ బృందం నృసింహుడు నృత్య రూపకం ప్రదర్శించారు. ఈ కార్యక్రమాలు ప్రేక్షకులలను ఎంతగానో అలరించాయి. 'సంప్రదాయం' డైరెక్టర్ స్వాతిసోమనాథన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన దీపాల డ్యాన్స్ ఆకట్టుకుంది. అనంతరం లేజర్ షో ఎంతగానో అలరించింది. సినీ నేపథ్య గాయని మంగ్లీ బృందం సినీ గీతాలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తదితరులు పాల్గొన్నారు.



కళాకారుల విన్యాసం..



తిలకిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే శంకర్



ఆలయం ఎదుట పూలమొక్కలతో అలంకరణ



డ్యాన్స్ షో..



కచేరీలో పాల్గొన్న కళాకారులు

సమన్వయంతో పనిచేయాలి

- విధులకు హాజరు కాకుంటే తక్షణ చర్యలు
- ఏం జరిగినా సెక్టోరియల్ అధికారులను ప్రశ్నిస్తా
- రథసప్తమి వేడుకల సమీక్షలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అరసవల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి ఉత్సవాల సందర్భంగా లక్షలాదిగా భక్తులు ఆదిత్యుని దర్శనానికి తరలి రానున్నారు. ఉత్సవ ఏర్పాట్లపై ఆలయం వద్ద అన్ని శాఖల అధికారులు, ముఖ్య సిబ్బందితో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు. ఏం జరిగినా సెక్టోరియల్ అధికారులను ప్రశ్నిస్తానని, వారే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఎవరైనా సిబ్బంది విధులకు హాజరు కాకున్నా... విధుల సమయంలో అందుబాటులో లేకున్నా వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో మాక్ డ్రిల్ నిర్వహించాలని చెప్పారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ అధికారుల మధ్య సమన్వయం ఉండాలన్నారు. కంట్రోల్ రూమ్ నుంచి అధికారులకు ఏదైనా సమాచారం వస్తే తక్షణం స్పందించాలని ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అత్యంత అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఆలయ సిబ్బందికి పోలీసు వాకీటాకీలు ఇస్తామని... అత్యవసర సమయాల్లో అవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. సమీక్ష అనంతరం వారు ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మతో కలిసి ఆలయం లోపలికి భక్తులు ప్రవేశించే క్యూలైన్లు, దర్శన ఏర్పాట్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది, ఆలయ ఈవో తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి

- సమన్వయంతో విధులు నిర్వర్తించాలి
- ఎస్పీ మహేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రథసప్తమి రోజున ఆదిత్యుని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలని.. వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని జిల్లా పోలీసు యంత్రాంగానికి ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సూచించారు. సోమవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమయ్యే క్షీరాభిషేకం సేవకు తరలివచ్చే లక్షల మంది భక్తులకు కల్పించాల్సిన భద్రత, బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా క్యూలైన్లలో దర్శనాలకు అనుమతించాలని చెప్పారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, బస్సులను పార్కింగ్ స్థలాల్లో నిలిపేలా చూడాలన్నారు. తాగునీరు, వైద్య శిబిరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. పోలీసు కంట్రోల్ రూమ్ ద్వారా తోపులాట, అంతరాయం కలుగకుండా చూసుకోవాలన్నారు. అనంతరం క్యూలైన్లలో వచ్చే భక్తులకు అత్యవసర సేవలందించే విషయమై ఎస్పీ తొలిసారిగా మాక్‌డ్రిల్ నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్‌తో కలిసి బందోబస్తుపై ఎస్పీ సమీక్షించారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఏఎస్పీ లు కేవీ రమణ, పి.శ్రీనివాసరావు, అనకాపల్లి అదనపు ఎస్పీ దేవప్రసాద్, పార్వతీపురం ఏఎస్పీ అంకిత సురాన డీఎస్పీ సీహెచ్ వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

ఓం నమో సూర్యాయ

(ఐదో పేజీ తరువాయి)

ఆలయానికి చేరుకున్నారు. రాత్రి 11 గంటల నుంచే క్యూలో బారులుదీరారు. దాతలు, ప్రముఖుల స్వామిని దర్శించుకున్నారు.

దర్శించుకున్న మంత్రులు

ఆదిత్యుడ్ని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు గొండు శంకర్, గౌతు శిరీష, బగ్గు రమణమూర్తి, కూన రవికుమార్, నడుకుదిటి ఈశ్వరరావు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవి, వరుదు కల్యాణి, మాజీమంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయా, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి తదితరులు దర్శించుకున్నారు.

అంతటా నిఘా

ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో 3వేల మంది పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. డ్రోన్లతో నిఘా.. సత్వరమే చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక బలగాలను సిద్ధం చేశారు. దీంతోపాటు ఉచిత వైద్యశిబిరాలు, అలాగే సత్యసాయి, ఇతర కుల సంఘాలు.. కార్పొరేట్ సంస్థలకు చెందిన అన్న ప్రసాద వితరణ స్టాల్స్ వెలిశాయి. ఇదిలా ఉండగా పర్యాటకుల తాకిడి పెరగడంతో హెలీటూరిజంను మరో రెండు రోజుల వరకు పెంచారు.

అక్షర వసంతం

- ఘనంగా వసంత పంచమి పూజలు
- జిల్లా వ్యాప్తంగా అక్షరాభ్యాసాలు
- సరస్వతీ దేవి ఆలయాలు కిటకిట

వసంత పంచమి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గల ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. సరస్వతీ దేవి ఆలయాలు... ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు.

- ఆంధ్రజ్యోతి బృందం



సోంపేట: బారువ కనకదుర్గ ఆలయ ఆవరణలో..





కవిటి: కె.కొత్తూరులో సామూహిక అక్షరాభ్యాసాలు



శ్రీకాకుళం పట్టణంలో..



ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో..



పలాస: జ్ఞాన సరస్వతి ఆలయంలో..



వజ్రపుకొత్తూరు: ప్రభుత్వ పాఠశాలలో..



జ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో..

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని సద్గురు సాయినాథ సహిత జ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో వసంత పంచమిని పురస్కరించుకొని సామూహిక అక్షరాభాస్యాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మావుడూరు ప్రసాదబాబు, సాయి భార్గవ్ శర్మ ఆధ్వర్యంలో సుమారు 130 మంది చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.

← చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయిస్తున్న దృశ్యం

ఐదో తేదీ వరకూ హెలీ టూరిజం: పీడీ



హెలికాప్టర్ ఎక్కుతున్న పర్యాటకులు

శ్రీకాకుళంక్రైం,ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రజల డిమాండ్ మేరకు హెలీ టూరిజం ఐదో తేదీ వరకూ కొనసాగిస్తామని డ్వామా పీడీ భీంపల్లి సుధాకర్ తెలిపారు. హెలీటూరిజం ద్వారా ఢిల్లీ నుంచి హెలికాప్టర్‌ను తీసుకొచ్చి 2,3,4 తేదీల్లో జిల్లా ప్రజలకు వినువీధిలో విహరించే అవకాశం ప్రభుత్వం కల్పించినట్లు చెప్పారు. దీనికోసం ఒక్కొక్కరికి రెండు వేల రూపాయలు టిక్కెట్ ధర నిర్ణయించగా, కేంద్ర విమానయానశాఖ మంత్రి ఒక్కో టిక్కెట్‌పై సొంతంగా 200లు చెల్లిస్తూ ప్రజలకు 1800కే టిక్కెట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. రెండో తేదీన 200 మంది హెలికాప్టర్‌లో విహరించేయగా, రూ.3.60 లక్షలు ఆదాయం వచ్చిందని, సోమవారం 270 మంది హెలికాప్టర్ ఎక్కగా, 45 రౌండ్ల తిరగడంతో రూ. 4 లక్షల 86 వేలు ఆదాయం వచ్చినట్లు చెప్పారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ టిక్కెట్లను ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద విక్రయిస్తున్నట్లు తెలిపారు. కాగా రథసప్తమిని ప్రభుత్వం రాష్ట్రపండగగా ప్రకటించడంతో తొలిసారిగా జిల్లా యంత్రాంగం హెలికాప్టర్ విహారం కార్యక్రమం మూడురోజులపాటు ఏర్పాటుచేసింది. శ్రీకాకుళంలోని డచ్ బిల్డింగ్ వద్ద ఏర్పాటుచేసిన హెలికాప్టర్ ద్వారా ప్రతిరోజూ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పట్టణంలోని వీధుల్లో సంచరిస్తోంది. ఎనిమిది నిమిషాలపాటు హెలికాప్టర్‌లో విహరించేలా జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. ఒక ట్రిప్పుకి ఆరుగురు చప్పున రోజుకు 200 నుంచి 250 మందిని హెలికాప్టర్‌లో విహరిస్తున్నారు. గగనవీధిలో నుంచి అరసవిల్లి ఆలయ గోపురాన్ని చూసి పర్యాటకులు పులకించిపోతున్నారు.

రైల్వే అండర్ పాసేజ్ నిర్మించండి

- ఇచ్ఛాపురంలో విద్యార్థులు, యూనియన్ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థులు, వివిధ సంఘాల నాయకులు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నుంచి కొళిగాం వెళ్లే మార్గంలో రైల్వే అండర్ పాసేజ్ నిర్మించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు డిమాండ్‌చేశారు.ఇక్కడ పాసేజ్ లేకపోవడంతో వాహనచోదకులు, విద్యార్థులు, చుట్టుపక్కల 30గ్రామాలప్రజలు ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. ఈమేరకు సోమవారం ఇచ్ఛాపురంలో రైల్వే ఎల్‌సీగేటు వద్ద జనసేన నాయకులు, వివిద కళాశాలల విద్యార్థులు, ఆటో, ట్యాక్సీ యూనియన్ల నాయకులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రతి 20 నిమిషాలకు గేట్ పడడం వల్ల అత్యవసర సమయాల్లో రోగులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు.అనంతరం జీఎం పరమేశ్వర్ ఫక్వాల్‌ను కలిసి వినతిపత్రం అందజేసి అండర్‌పాస్ లేకపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అండర్‌పాసేజ్ నిర్మాణానికి అవకాశముంటే పరిశీలిస్తామని, ప్రస్తుతం ఆర్‌వోబీ నిర్మిస్తామని తెలిపారు.

ప్రాథమిక పాఠశాలను విలీనం చేయవద్దు



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న కొండపోలేరు గ్రామస్థులు

కంచిలి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి):కొండపోలేరు ప్రాథమిక పాఠశాల విలీనం చేయవద్దని గ్రామస్థులు కోరారు.ఈ మేరకు ఎంఈవో శివరాంప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో 28 మంది చదువుతున్నారని, 3,4,5 తరగతుల్లో 15 మంది విద్యార్థులను పోలేరు పాఠశాలలో విలీనం చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయని తెలిపారు. తమ గ్రామానికి చెందిన విద్యార్థులు 2018-19 విద్యా సంవత్సరం నుంచి ప్రైవేటు పాఠశాలలకు వెళ్లకుండా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుంటున్నారని తెలిపారు. ఇప్పుడు విలీనం చేస్తే మళ్లీ ప్రైవేటు పాఠశాలల్లో చేరే అవకాశముంటుందని, దీంతో లీనం నిలుపుదల చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసీ ఛైర్మన్, యువత పాల్గొన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గీత కులాలకు కేటాయించిన మద్యం షాపుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ పి.దుర్గా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మునిసిపాలిటీలో శ్రీశయనకు, రూరల్ పరిధిలో గౌడ సామాజికవర్గానికి, కవిటి మండలానికి సంబంధించి శ్రీశయనలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు గురువారం సాయంత్రంలోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అర్హత కలిగిన వారు రూ.రెండు లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కలెక్టర్ సమక్షంలో ఈనెల ఏడోతేదీన డ్రా తీసి షాపులు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

నిర్వహణ లేక.. పర్యవేక్షణకు నోచుకోక

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- ఇదీ నారాయణపురం ఆనకట్ట అతిథిగృహం పరిస్థితి



నిర్వహణ లేక మూతపడిన అతిథి గృహం

బూర్జ, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): నారాయణపురం ఆనకట్ట వద్ద నిర్మించిన ప్రభుత్వ అతిథి గృహం అధికారుల నిర్వహణ లోపం వల్ల నిరుపయోగంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సైతం గతంలో స్టే చేసిన ఆ బంగ్లా ప్రస్తుతం మూతపడింది.కనీసం శుభ్రం చేసే వారు లేకపోవడంతో చెత్తపేరుకుపోయింది. ఆనకట్ట అందాలను తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు అల్లరి మూకల చేష్టలకు భయాందోళన చెందుతున్నారు. ఇక్కడ జూదర్లు, మందుబాబులను అరికట్టాలని నారాయణపురం, లాభాం గ్రామస్థులు కోరుతున్నారు. మూడు దశాబ్దాల కిందట నిర్మించిన ఈ బంగ్లా నిర్వహణలోపం పుణ్యమాని ఆనకట్ట పరిశీలనకు వచ్చే అధికారులు పాలకొండ, శ్రీకాకుళంలోని ప్రైవేటు అతిథి గృహాల్లో ఉండాల్సివస్తోంది. టీడీపీ హయాంలో వినియోగంలో ఉండేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జలవనరులశాఖ అధికారులు నిర్లక్ష్యం పుణ్యమాని నిరుపయోగంగామారింది. తక్షణమే అధికారులు స్పందించిభవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

పనులు వేగవంతం చేయండి

- స్టేషన్లల్లో సమస్యల పరిష్కారానికి కృషి
- ఈస్ట్‌కోస్టు రైల్వే జీఎం పరమేశ్వర్ ఫక్వాల్



పలాస: రైల్వే జీఎం ఫక్వాల్‌కు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

రైల్వే స్టేషన్లల్లో పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులు ఈస్ట్‌కోస్టు రైల్వే జీఎం పరమేశ్వర్ ఫక్వాల్ ఆదేశించారు. సోమవారం ఇచ్ఛాపురం, బారువ,సోంపేట రోడ్డు, పలాస రైల్వేస్టేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సంఘాల, రాజకీయపార్టీల నాయకులు రైళ్ల హాల్టింగ్, ఆర్వోబీల నిర్మాణంతోపాటు పలుసమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైల్వేస్టేషన్లల్లో సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీఇచ్చారు.

● ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు వేగవంతంచేయాలని ఈస్ట్‌కోస్టు రైల్వేజీఎం పరమేశ్వర్ ఫక్వాల్ కోరారు. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనులు పరిశీలించారు. అనంతరం రైల్వే క్వార్టర్స్‌లో పార్క్‌ను ప్రారంభించారు. రైలు నిలయంలో సమస్యలను ఎమ్మెల్సీ నర్తు రామారావు, మునిసిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, జడ్ఆర్‌యూసీసీసభ్యుడు శ్రీనివాస్‌రౌళో వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో డీఆర్ఎం భజానా, చీఫ్‌హెల్త్ ఆఫీసర్ రవికుమార్, స్టేషన్ మాస్టార్ సాహు, సాయికామేష్, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

● సోంపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బారువ రైల్వేస్టేషన్ సమస్యలు పరిష్కరించాలని కొర్లాం సర్పంచ్ రాంబుడ్డి రమణమ్మ, బారువ ఆర్ఎస్ యూజర్స్ కమిటీ ప్రతినిధులు గణపతి, రత్నాల శ్రీనివాసరావు కోరారు.పరమేశ్వర్‌ఫక్వాల్, డీఆర్ఎం బజ్వాకు వినతిపత్రం అందజేశారు.

● కంచిలి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సోంపేట ఆర్ఎస్ కంచిలి రైల్వే స్టేషన్ పరిధిలో గల సమస్యలు పరిష్కరించాలని కంచిలి గ్రామస్థులు కోరారు.ఈమేరకు రైల్వేస్టేషన్‌ను సందర్శించిన జీఎం పరమేశ్వర్ ఫక్వాల్ వినతిపత్రం అందజేశారు. సోంపేట స్టేషన్‌లో ప్రధాన పాసిం జర్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని శ్రీనివాస్‌రౌళో కోరారు.షెడ్లు నిర్మించాలని జడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి వినతిపత్రం అందజేశారు.

పనులపై అసంతృప్తి

పలాస, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రైల్వే కాలనీలో సిబ్బంది గృహాలు, కాలువల పనులకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులపై జీఎం పరమేశ్వర్ ఫక్వాల్ అసంతృప్తి వ్యక్తంచేశారు.పలాస రైల్వే స్టేషన్‌లో, రైల్వే కాలనీ, డ్రైవర్లు,గార్డుల రన్నింగ్‌రూమ్, ఆర్పీఎఫ్ బ్యారక్స్‌లను తనిఖీ చేశారు. సిబ్బంది క్వార్టర్స్‌కు నిధులిస్తున్నా ఎందుకుపనులు అసంపూర్తిగా ఉన్నాయని ప్రశ్నించారు. కాలువల నిర్వహణపై మండిపడ్డారు. అనంతరంస్టేషన్‌లో రన్నింగ్‌రూమ్, రోడ్ల నిర్వహణ బా గుందని పేర్కొని అధికారులకు రివార్డు ప్రకటించారు. ఆయన వెంట ఖుర్ధారోడ్ డీఆర్ఎం హెచ్ఎస్.భజ్వా, అధికారులు ఉన్నారు.

రైల్వే ఫ్లైఓవర్‌ను పూర్తి చేయండి: ఎమ్మెల్యే శిరీష

రైల్వే ఫ్లైఓవర్‌ను పూర్తిచేయడానికి నిధులు కేటాయించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు రైల్వే జీఎం పరమేశ్వర్ ఫక్వాల్‌కు వినతిపత్రం అందించారు. అమృతభారత్‌లో పలాస ఎంపిక కావడంతో పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టి ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్లాట్‌ఫారం ఒకటిని టిక్కెట్ కార్యాలయం మార్గంలో ఏర్పాటుచేయాలని, వృద్ధులు ప్లాట్‌ఫారాలపైకి వెళ్లేందుకు అసౌకర్యానికి గురవుతున్నారని జీఎం దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించి బ్యాటరీవాహనాలు ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు.

●వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పూండి రైల్వేస్టేషన్‌లో హౌరా-చెన్నై, విశాఖ- బరంపూర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చఈశ్వరరావు జీఎంకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ నేతలు లొడగల కామేశ్వరరావుయాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, కర్ని రమణ పాల్గొన్నారు.

● హరిపురం, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): మందస రోడ్(హరిపురం) రైల్వేస్టేషన్ సమస్యలు రైల్వేజీఎం పరమేశ్వర్ పక్వాల్, డీఆర్ఎం హెచ్ఎస్ భజ్వాల దృష్టికి తీసుకెళ్లినట్లు రైల్వే సమస్యల సాధన కమిటీ సభ్యులు కొర్ల కన్నారావు, కొత్ర ఆనంద్, కె.సురేష్, వెంకటరావు తెలిపారు. పలాస వచ్చిన రైల్వే అధికారులను ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి వినతిపత్రం అందించామన్నారు.

ఏడో తేదీన చలో హైదరాబాద్

గార, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):లక్ష డప్పులు కార్యక్రమం, చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం అంపోలులో ఈనెల ఏడో తేదీన నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు లోపింటి తేజేశ్వరరావు, గార మండలాధ్యక్షులు కంటిపాక రాధాకృష్ణ, అప్పారావు, సిమ్మయ్య, సురేంద్ర పాల్గొన్నారు.

రాధాకృష్ణ మందిరంలో పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి):బంటుపల్లి పంచాయతీ పరిధిలోని గోశాల, రాధాకృష్ణ మందిరంలో సోమవారం పూజలు నిర్వహించారు. జగన్నాథ, సుభద్ర, బలభద్ర విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు పురస్కరించుకుని వేదమంత్రాలతో మందిర ప్రాంగణం హోరెత్తింది. బంటుపల్లి, కొప్ప, పల్లిపేట, కంబాలపేట నుంచి మహిళలు కలశాలతో తరలొచ్చారు. శ్రీకృష్ణ చైతన్య మిషన్ వర్తమాన అధ్యక్షుడు కేశవగోస్వామి మహారాజ్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో ఎమ్మెల్యే నడుకదిటి ఈశ్వరరావు, ఎంపీ సతీమణి కలిశెట్టి ప్రభానాయుడు, జగన్నాథనాయుడు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే శంకర్



వీర వసంత ఈశ్వరస్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

గార, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వీర వసంత ఈశ్వర స్వామి తదితర ఆల యాల అభివృద్ధికి కృషిచేస్తానని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. సోమవారం శాలిహుండాం వద్ద గల శ్వేతగిరిపై వెలసిన వీర వసంత ఈశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు మహేంద్రాడ రవికుమార్, వేద పండితులు, స్వాగతం పలికారు.

● శ్వేతగిరిపై వీర వసంత ఈశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం, లక్ష్మీనరసింహ దత్తాత్రేయ స్వామి ఆలయాల శిఖరప్రతిష్ఠ కార్యక్రమాలు సోమవారంవైభవంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు మహేంద్రాడ రవికుమార్, వసుంధర దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుండ భాస్కరరావు, సర్పంచ్ కె.ఆదినారాయణ పాల్గొన్నారు.

స్పీడ్‌స్కేటింగ్‌లో సత్తాచాటిన బాలలు

సోంపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సోంపేటకు చెందిన బాలలు తెలుకుల అన్వీకశ్రీ, తెలుకుల అన్సికశ్రీ,విష్ణువర్ధన్, సుమంత్,విజయ్, కౌశిక్ స్పీడ్‌స్కేటింగ్ పోటీల్లో సత్తాచాటారు. ఈమేరకు తమిళనాడులోని మధురాలో స్పీడ్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 24వ జాతీయ స్పీడ్‌స్కేటింగ్ పోటీలు నిర్వహించారు.పోటీల్లో సోంపేటకు చెందిన బాలలు జాతీయస్థాయిలో బహుమతులు సాధించినట్లు శిక్షకురాలు చంద్రావతి తెలిపారు.

పోలీసుల ఆంక్షలతో భక్తుల అవస్థలు

అరసవల్లి,ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలో సోమవారం అర్ధరాత్రి ప్రారంభమైన రథసప్తమి వేడుకల్లో భాగంగా పోలీసులు ఆంక్షల వల్ల భక్తులు అవస్థలకు గురవుతున్నారు. అరసవల్లికి వెళ్లే మార్గంలో గల మిల్లు జంక్షన్ వద్ద బారికేడ్లను ఏర్పాటుచేసి ట్రాఫిక్‌పై ఆంక్షలు విధించారు. దర్శనానికి కాలినడకన వెళ్లే భక్తులను మాత్రమే అనుమతించారు. జంక్షన్‌కు సమీపంలోనే నివసిస్తున్నవారు తమ ఇళ్లకు చేరుకునేందుకు పోలీసులు ఆంక్షల నేపథ్యంలో అగచాట్లకు గురవుతున్నారు. ప్రతి ఏటా రథసప్తమి పురస్కరించుకుని ఇదే పరిస్థితి అరసవల్లి మార్గంలో నెలకుంటోంది. ఈ ఏడాదైనా ఇటువంటి ఇబ్బందుల నుంచి తప్పించాలని, ఆధార్‌కార్డులను చూపిస్తే అనుమతించాలని అధికారులకు విన్నవించుకున్న విషయం విదితమే. అయినా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోలేదని పలువురు అరసవల్లి వాసులు వాపోతున్నారు. సోమవారం రాత్రి విధుల నిర్వహణలో భాగంగా వెళ్తున్న ఓ జిల్లా ఉన్నతాధికారి వాహనం సైతం పోలీసులు అడ్డుకోవడం విశేషం.

110 మందికి కంటి పరీక్షలు

రణస్థలం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతర్లపల్లిలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 110 కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, 41 మంది శస్త్ర చికిత్సకు ఎంపికచేశారు. ఈ సందర్భంగా 110 కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, 41 మంది శస్త్ర చికిత్సకు ఎంపికచేశారు

క్రైం కార్నర్

ఉద్యోగ విరమణ చేసి.. స్వగ్రామానికి వస్తూ..

● సికింద్రాబాద్‌లో ఆర్మీ ఉద్యోగి మృతి


వెంకటరమణ (ఫైల్)

ఎల్.ఎన్.పేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఆర్మీ ఉద్యోగిగా సుమారు 22 ఏళ్ల పాటు పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన బొర్రంపేటకు చెందిన కాగితాపల్లి వెంకటరమణ (44) గుండెపోటుతో మృతి చెందారు. దీంతో స్వగ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్ ఆర్మీ కార్యాలయంలో లాన్స్ నాయక్‌గా పనిచేసిన వెంకట రమణ జనవరి 31న ఉద్యోగ విరమణ చేశారు. ఆదివారం స్వగ్రామం వచ్చేం దుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వస్తూ ఆ సమీపంలో గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న భార్య పద్మావతి వెంటనే సికింద్రాబాద్ చేరుకుని మిలటరీ సిబ్బంది సాయంతో మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువస్తున్నారు. మిలటరీలో పనిచేస్తూ సెలవులకు స్వగ్రామం వచ్చే వెంకటరమణ అందరితో కలివిడిగా ఉంటూ ఉండే వారని, మంచి వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారని గ్రామస్థులు తెలిపారు. అయితే ఉద్యోగ విరమణ చేసిన వెంటనే ఇలా మృతి చెందడంతో గ్రామం విషాదంలో మునిగిపోయింది. మృతుడికి భార్య పద్మావతి, ఇద్దరు కుమార్తెలున్నారు. స్వగ్రామంలో మంగళవారం అధికారిక లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఆటో బోల్తా: వ్యక్తి మృతి



బోల్తాపడిన ఆటో (ఇన్‌సెట్‌లో) మురళి (ఫైల్)

నరసన్నపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నడగాం పంచాయతీ శివరాంపురం గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మెయ్యవానిపేటకు చెందిన మెయ్య మోహన్‌మురళీ (46) రాత్రి 12 గంటలు దాటిన తరువాత ఆటో నడుపుకుంటూ నరసన్నపేట నుంచి ఇంటికి వెళు తున్న సమయంలో పొగమంచు కారణంగా ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో ఉన్న మోహన్ మురళి తుళ్లి పక్కనున్న పొదల్లో పడ్డాడు. ఎంతసేపయినా భర్త ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో భార్య భాగ్య లక్ష్మి గ్రామస్థుల సహకారంతో నడగాం వెళ్లే మార్గంలో వెతుకు తుండగా ఆటో బోల్తాపడి ఉండడాన్ని గమనించి అక్కడికి వెళ్లారు. అప్పటికే సదరు వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే ట్రాక్ పనులు చేసే కూలీలను బడగాం, గొనపపేట గ్రామాల్లో దించి ఇంటికి తిరిగి వెళ్లే సమయంలో ఈ ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

ఖాజీపేట కొట్లాట కేసులో 10 మంది అరెస్టు

పొందూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కింతలి పంచాయతీ ఖాజీపేటలో ఆదివారం జరిగిన కొట్లాట, దాడి సంఘటనలో ఇరు వర్గాల ఫిర్యాదుమేరకు పది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. ఇరువర్గాలు దాడులు చేసుకోవడంతో హత్యాయత్నం కేసును నమోదుచేసిన విషయం విదితమే. సోమవారం ఖాజీపేటలో దాడిపై ఎస్ఐ సత్యనారాయణ దర్యాప్తు నిర్వహించారు. ఒకవర్గానికి చెందిన ఇద్దరితోపాటు మరో వర్గానికి చెందిన ఎనిమిది మందిని సోమవారం అరెస్టు చేశారు. బాధితురాలు రోజా ఇల్లు, దాడిలో ధ్వంసమైన ఆటోను పరిశీలించారు.

కనిమెట్టలో చోరీ

పొందూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనిమెట్టలో గ్రామానికి చెందిన పి.వెంకట సత్యవతి ఇంట్లో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం చోరీకి పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. ఇంటికి తాళాలు వేసి ఆదివారం ఉదయం పనులకు బయటకు వెళ్లారు. ఇంటికి తిరిగివచ్చి చూసేసరికి దుస్తులు చిందర వందరగా పడి ఉన్నాయి. ఇంటిలో స్లేడ్‌పై పెట్టెలో ఉంచిన రూ.75 వేలు నగదు, తులంపావు బంగారం చోరీకి గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎస్ఐ సిబ్బందితో ఇంటిని పరిశీలించారు. చోరీపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దొంపాక వద్ద కారు దగ్ధం

● ప్రయాణికులు క్షేమం


మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

జలుమూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దొంపాక గ్రామం వద్ద సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కారు దగ్ధ మైంది. అయితే అందులో ఉన్న ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు, ప్రయాణికులు తెలిపిన వివరా లిలా ఉన్నా యి.. విశాఖపట్నం నుంచి వై.శోభారాణి కుటుంబ సభ్యులు జోగులపేటలో ఉన్న బంధువుల ఇంటికి కారుపై వచ్చారు. తిరుగు ప్రయాణంలో శ్రీముఖలింగేశ్వరుని దర్శించుకుని విశాఖ వెళుతుండగా తిమడాం దాటేసరికి ఇంజన్ నుంచి పొగలు రావడంతో గమనించిన వ్యవసాయ కూలీలు అప్ర మత్తం చేశారు. కారు డ్రైవింగ్ చేస్తున్న వై.శోభారాణి అప్రమత్తమై దొంపాక సమీపంలో కారును నిలుపుదల చేశారు. అప్పటికే కారులో పొగలు కమ్మి మంటలు రావడంతో అందరూ బయటకు వచ్చేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. రోడ్డుపై మినప చేను వేయడంతో అది ఇంజన్‌కు తగిలి మంటలు వ్యాపించినట్లు శోభారాణి ఆరోపించారు. వెంటనే టెక్కలి అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చే సరికే కారు పూర్తిగా కాలి పోయి నట్లు స్థానికులు తెలిపారు. కారులో తనతో పాటు తన చెల్లి, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు ఆమె తెలిపారు.

కొమనాపల్లి వద్ద గడ్డివాము..


గడ్డివాము మంటలను అదుపు చేస్తున్న దృశ్యం

జలుమూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కొమనాపల్లి కూడలిలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో 6 ఎకరాలు గడ్డివాము దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కొమనాపల్లికి చెందిన ముద్దాడ అప్పలసూర్యనారాయణకు చెందిన గడ్డివాము కాలిపోయింది. పశువుల కోసం వరిగడ్డి కుప్ప ఏర్పాటు చేయగా అగ్నిప్రమాదంలో దగ్ధమైనట్లు బాధితుడు తెలిపారు. సమాచారం తెలుసుకున్న నరసన్నపేట అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలాన్ని చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. అగ్నిప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.

స్వరూపం కోల్పోతున్న గెడ్డలు

● సాగునీటికి ఇబ్బందులుపడుతున్న రైతులు


నర్సింగపల్లి దుర్గగెడ్డలో పెరిగిన పిచ్చిమొక్కలు

టెక్కలి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): టెక్కలి మండలంలో వందలాది ఎకరాలకు సాగునీరందించే మాలపేట గెడ్డ, దుర్గ గెడ్డలు స్వరూపాలే మారిపోతున్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లు కాలువల అభివృద్ధికి ఒక్క పైసా విదల్చకపోవడంతో సాగునీరు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాలువలు పిచ్చిమొక్కలు, పూడికలతో నిండిపోయి దారు ణంగా ఉన్నాయి. మరికొన్ని ఆక్రమణలకు గురవుతున్నాయి. నెల్లూరు చెరువు నుంచి మదన గోపాలసాగరం వరకు కలిపే ఈ మాలపేట గెడ్డ పరిధిలో గూడేం, రాంపురం, లక్ష్మీంపురం, జయపురం, కిట్టాలపాడు, డమర, సోమనాథపురం గ్రామాలకు చెందిన భూములు సాగు చేస్తున్నారు. అలాగే దుర్గగెడ్డ కింద నర్సింగపల్లి, మొఖలింగాపురం, లంకపాడు, చిరుతునాపల్లి గ్రామాల రైతులు సాగు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల రైతులు కోరుతున్నారు.

కాలువలో కానరాని సాగునీరు


నరేంద్రపురం వద్ద చుక్కనీరు లేని వంశధార కాలువ

నందిగాం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలో రబీ కింద సాగు చేస్తున్న పంటలకు వంశధార నీరు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖరీఫ్ చివరాంకంలో వర్షం పడడంతో రబీకి ఉపకరిస్తుందని భావించిన రైతు లు వరితో పాటు వేరుశనగ, జొడి తదితర పంటలు చేపట్టారు. అయితే వంశధార కాలువలో సాగునీరు రాకపోవడంతో ఉన్న పంటలను కాపాడుకోవడం ఎలా అని వారు ఆవేదన చెందుతున్నారు. నందిగాం, పెంటూరు, నరేంద్రపురం, వేణుగోపాల పురం, దిమిలాడ, దేవళభద్ర, జల్లపల్లి, నర్సిపురం, గొల్లూరు, శివరాంపురం, పాలూరు, వల్లభరాయుడుపాడు తదితర గ్రామాల్లో వరితో పాటు వేరుశనగ పంటను సాగు చేస్తున్నారు. అయితే నీరు లేకపోవడంతో సుదూర ప్రాంతంలో ఉన్న బావులు, చెరువుల నుంచి పైపులు పెట్టి పంటను రక్షించుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. మంత్రి అచ్చెన్నాయుడు ఇటీ వల వంశధార అధికారులకు కాలువ ద్వారా నీరు విడిచిపెట్టాలని సూచించినప్పటికీ ఆ నీరు టెక్కలి పరిసర ప్రాంతాల వరకు కూడా రాకపోవడంతో మండల పరిధిలోని వందలాది ఎకరాలు నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పుణ్య స్నానాలకు ఏర్పాట్లు


నువ్వలరేవు తీరంలో టెంటు ఏర్పాటు చేసిన పోలీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి పర్వదినం సందర్భంగా పవిత్ర స్నానాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ బి.నిహార్ తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'రథసప్తమికి ఏర్పాట్లేవీ' శీర్షికతో వచ్చిన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు ఎస్ఐ నిహార్ ఆధ్వర్యంలో శివసాగర్‌బీచ్, నువ్వలరేవు సముద్రతీరాల్లో స్నానాలు చేసిన భక్తులు వస్త్రాలు మార్చుకునేందుకు వీలుగా టెంట్లు ఏర్పాటు చేశారు. వాహనాల రద్దీ దృష్ట్యా పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పోలీసులను తీరంలో నిఘా ఉంచామని తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ


పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు అందిస్తున్న దృశ్యం

హరిపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మందస మండలం హరిపురంలో కోస్టల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం 22 మంది పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు, దుప్పట్లను పంపిణీ చేశారు. రథసప్తమి సందర్భంగా వీటిని అందించినట్లు సంస్థ అధ్యక్షుడు బైరిశెట్టి గున్నయ్య, కార్యదర్శి వైఎస్ఎన్ మూర్తి తెలిపారు. క్లబ్ ద్వారా ఉద్దానం ప్రాంతంలో విద్యా, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పుల్లా వాసుదేవు, లక్ష్మణరావు, సానా లింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపొందించుకోవాలి

టెక్కలి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఏ కంపెనీ అయినా సమర్థులకే ఉద్యోగాలిస్తాయని, అందువల్ల ప్రతి విద్యార్థి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సీఎస్ఈ) హైదరాబాద్ చైర్మన్ సీహెచ్ సుధాకర్ అన్నారు. ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర స్థాయి టెక్నో విజన్ సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ మేధస్సుకు సాంకేతికత తోడైతే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. సీఎస్ఈ కార్యదర్శి డాక్టర్ డీవీ రమణ మాట్లాడుతూ సాంకే తికత వైపు ప్రపంచం పరుగులు తీస్తుందన్నారు. ఉత్తరాఖండ్‌లోని ఒక గ్రామం మొత్తం ఇంటర్నెట్ హబ్‌గా మార్చేందుకు విద్యార్థులు చేసిన కృషిని గుర్తుచేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, అకడమిక్ డీన్ డాక్టర్ బీవీ రమణ, కన్వీనర్, సీఎస్ఈ హెచ్‌వోడీ డాక్టర్ వై.రమేష్ పాల్గొన్నారు.

కేన్సర్.. కలవరం

(ఐదో పేజీ తరువాయి)

కేన్సర్ ఉంది. కొర్లాం పీహెచ్‌సీలో 39 మందికి నోటి, 9 మందికి రొమ్ము, 11 మందికి సర్వైకల్ కేన్సర్ లక్షణాలు ఉన్నాయి. ఎచ్చెర్ల పీహెచ్‌సీలో 37 మందికి నోటి, 34 మందికి రొమ్ము, 14 మందికి సర్వైకల్ కేన్సర్ ఉన్నట్టు గుర్తించారు. ఆమదాలవలస మండలం దూసి పీహెచ్‌సీలో 36 మందికి నోటి, 12 మందికి రొమ్ము, 10 మందికి సర్వైకల్ కేన్సర్ ఉంది. సంతబొమ్మాళి, పోలాకి, తాడివలస పీహెచ్‌సీల పరిధిలో 20 మందికిపైగా నోటి కేన్సర్ లక్షణాలున్నట్లు గుర్తించారు. కేన్సర్ లక్షణాలు బయటపడినవారికి జిల్లాలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మరోసారి పరీక్షలు చేస్తున్నారు. కేన్సర్ లక్షణాలను నిర్ధారిస్తున్నారు. కాగా చాలా మంది భయంతో పరీక్షలు చేసుకునేందుకు వెనుకంజ వేస్తున్నారు. అటువంటి వారికి వైద్య ఆరోగ్య శాఖ కౌన్సెలింగ్ చేస్తే తుది పరీక్ష చేయించుకునేందుకు అవకాశం ఉంది.

ఊతం ఇచ్చిన కేంద్రం

కేన్సర్ నివారణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. క్షేత్రస్థాయిలో స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించి.. ప్రతి జిల్లాలోనూ చికిత్స అందజేసేలా కేన్సర్ డే కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. అలాగే 36 ప్రాణాధార ఔషధాలపై జీఎస్టీ తగ్గించింది. కేన్సర్ బాధితుల ప్రాణాలు కాపాడే ఔషధాల ధరను ప్రజలకు మరింత అందుబాటులోకి తెచ్చి కొంత ఊతం ఇచ్చింది. కాగా.. ప్రజల్లో అవగాహన పెంచి, సకాలంలో లక్షణాలు గుర్తిస్తే కేన్సర్‌ను జయించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.

సకాలంలో గుర్తిస్తే మేలు



కేన్సర్‌ను స్ర్కీనింగ్ పరీక్షల్లో సకాలంలో గుర్తిస్తే.. చికిత్స ద్వారా వ్యాధి నయం చేయవచ్చు. క్యాన్సర్ బాధితులు మనో వేదన చెందరాదు. వారికి కుటుంబ సభ్యులు అండగా నిలవాలి. మానసిక ధైర్యంతో చికిత్స పొందితే.. కేన్సర్ త్వరగా నయమయ్యే అవకాశం ఉంది.

- డా.గున్ను లీలామోహన్ చంద్రశేఖర్, అంకాలజిస్టు, బసవ తారకం కేన్సర్ ఆసుపత్రి

సమష్టిగా గ్రామాలను అభివృద్ధి చేయండి

● మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కార్యకర్తలంతా సమష్టిగా పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ భవనంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం మంజూరు చేసిన నిధులతో కాలువలు, లింకు రోడ్లు, పాఠశాలల ప్రహరీల నిర్మాణం చేపట్టాలన్నారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా అందరూ సమష్టిగా పనిచేయాలని కోరారు. ప్రతి ఒక్కరి సమస్య అంచ లంచెలుగా నెరవేర్చేందుకు కృషి చేస్తానని, ఎవరూ నిరాశ పడవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కట్టుబడి ఉందన్నారు. సూపర్ సిక్స్ అమలులో ఎటువంటి రాజీ లేదని, ఇప్పటికే కొన్ని పథకాలు అమలు చేశామని, మిగిలిన త్వరలో అమలవుతాయన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్, టీడీపీ నేతలు చౌదరి బాబ్జి, బోయిన గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.


కార్యకర్తల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి అచ్చెన్నాయుడు

పర్యాటక కేంద్రంగా హనుమాన్ క్షేత్రం


మాకివలసలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని సత్కరిస్తున్న నిర్వాహకులు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

నరసన్నపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే ఎత్తైన హనుమాన్ విగ్రహం కలిగిన మడపాం హనుమాన్ క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం హనుమాన్ క్షేత్రం వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కూటమి ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి చేయూత ఇస్తుందన్నారు. బీవీకే విద్యామందిరంలో సరస్వతి విగ్రహాష్కరణ చేశారు. మాకివలసలో పాతపట్నం అమ్మతల్లి ఆలయ పునః ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, మాజీ ఎంపీపీ శిమ్మ పార్వతి, శిమ్మ చంద్రశేఖర్, నానాజీ గాడ్గే, గొద్దు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ స్కేటింగ్‌లో క్రీడాకారులకు 13 పతకాలు



జాతీయస్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు

కాశీబుగ్గ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో పలాస క్రీడాకారులు పలు విభాగాల్లో 13 పతకాలు సాధించినట్లు కోచ్ బి. చంద్రావతి తెలిపారు. తమిళనాడు రాష్ట్రం మధురైలో గత మూడు రోజులుగా జరిగిన జాతీయస్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచగా నిర్వాహకులు పత కాలు అందించి అభినందించారు. పతకాలు సాధించిన వారిలో తోసిని రాయ్, ఆయాన్, అన్విత, అంశక, రవి, పార్థసాయి, సుభాష్, ధనేష్, విష్ణు, సుమంత్, కౌశిక్, విజయ్ ఉన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను చంద్రావతితో పాటు రోలర్ స్కేటింగ్ క్లబ్ కోచ్ గోపిచంద్ అభినందించారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ


పతకాలతో టెక్కలి తైక్వాండో క్రీడాకారులు

టెక్కలి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్‌టీయూలో జనవరి 31, ఫిబ్రవరి 1, 2 తేదీల్లో జరిగిన ఎన్టీఆర్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా తరఫున పాల్గొన్న టెక్కలి క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఎనిమిది స్వర్ణాలు, ఆరు వెండి, ఏడు రజత పతకాలు సాధించారని కోచ్ నర్సిపురం శేఖర్ తెలిపారు. ఉత్తమ ఫైటర్‌గా తాస్వవి కృష్ణా సామీ, మెండ తపస్వీలకు ట్రోఫీ, స్పోర్ట్స్ కిట్ ఇచ్చి సత్క రించడంతో పాటు శ్రీకాకుళం జిల్లాకు ఓవరాల్ చాంపి యన్‌షిప్ మూడో స్థానం లభించగా ట్రోఫీ తో పాటు నగదు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా కోచ్ పాండవుల జగదీష్‌కు, రిఫరీ జస్వంత్‌కు, టీం మేనేజర్ పడాల అక్షా, ఆరంగి సాగర్‌లను ఆయన అభినందించారు.

వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు


సిబ్బందికి సూచనలిస్తున్న జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా

జలుమూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజా ఆదేశించారు. అచ్యుతాపురం వద్ద ఏర్పాటు చేసిన తాగునీటి ప్రాజెక్టును సోమవారం పరిశీలించారు. దీనివల్ల జలుమూరు, సారవకోట మండలాలకు చెందిన 94 గ్రామాలకు తాగునీరు అందుతున్నట్లు తెలిపారు. వేసవిలో మోటారు సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించి అప్రమత్తంగా ఉండాలన్నారు కార్యక్రమంలో ఎంపీడీవో కె.అప్పలనాయుడు, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రమౌళి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

'ఉపాధి' నిధులతో కాలువల మరమ్మతులు

కాశీబుగ్గ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వంశధార ఎడమ కాలువ మరమ్మతులకు ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ నిధులను కూటమి ప్రభుత్వం కేటాయించిందని పలాస నియోజకవర్గ జనసేన సమన్వయకర్త దుర్గారావు అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో వ్యవసాయం ఎక్కువగా కాలువ నీటి ద్వారానే సాగుచేస్తారని, అయితే గత ఐదేళ్లలో కాలువలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఉపాధి నిధులు కేటా యించిందని, దీంతో రైతులకు మేలు చేకూరుతుందన్నారు.

ఆకట్టుకున్న జానపద గేయాలు

నందిగాం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కృష్ణరాయపురంలో వేపపోలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా ఆదివారం రాత్రి జానపద గేయాలు ఆకట్టుకున్నాయి. బొడ్డపాడు గ్రామానికి చెందిన కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ కె.ఎర్రన్న, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఎం.పద్మావతి, సభ్యులు కళాకారులను సత్కరించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

హరిపురం, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలో ఇటీవల మృతి చెందిన టీడీపీ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే గౌతు శిరీష సోమవారం పరామ ర్శించారు. సిరిపురంలో దండాసి రౌలో, బోగాపురంలో బేసి గణపతి, లోహరిబంద కొత్తూరులో ధర్మాన కారయ్య కుటుంబాలను కలిసి సానుభూతిని తెలిపారు. టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆమెతో పాటు టీడీపీ నాయకులు బావన దుర్యోధన, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, రాజశేఖర్ తదితరులున్నారు.

పాఠశాలకు ప్రింటర్ అందజేత

హరిపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బాలిగాం ఎంపీపీ స్కూల్‌కు పూర్వవిద్యార్థులు రూ.23 వేలు విలువ చేసే కలర్ ప్రింటర్‌ను ఎంఈవో ఎం.లక్ష్మణరావుకు సోమవారం అందజేశారు. పూర్వ విద్యార్థులైన గున్న సాయి, బావన సతీష్, ఆరింగి శ్రీకాంత్ తమ తల్లిదండ్రుల చేతుల మీదుగా దీనిని అందించారు. బి.భారతి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో అద్దెలు చెల్లించండి

పలాస, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘానికి చెందిన దుకాణాలను నిర్వహిస్తున్న యజమానులు సకాలంలో అద్దెలు చెల్లించాలని కమిషనర్ ఎన్.రామారావు కోరారు. ఈ మేరకు సోమవారం మునిసిపల్ కార్యాలయంలో షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో ఉన్న లీజుదారులతో సమావేశం నిర్వహించారు. అద్దెలు పెంచడంతో రెండేళ్ల నుంచి లీజు కట్టడం లేదని, వివాదాలతో సంబంధం లేకుండా నిబంధనల ప్రకారం అద్దెలు చెల్లించాలన్నారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి

కాశీబుగ్గ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని కాశీబుగ్గ జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం చిన్న మనాయుడు అన్నారు. కవిటి మండలం జినగపుట్టుగ గ్రామానికి చెందని బుర్రకథ బృందం సోమవారం పాఠశాలలో 'విద్యార్థి మేలుకో' అంశంపై బుర్రకథ ద్వారా అవగాహన కలిగిం చారు. మంచి అలవాట్లు, సెల్‌ఫోన్ వాడకంవల్ల కలుగు నష్టం, మరుగుదొడ్ల వినియోగంపై కళాకారులు వివరించారు. బుర్రకథ కళాకారులు బాలక లోకనాథం, పురుషోత్తం, జ్యోతిలను హెచ్‌ఎం సత్కరించారు.

15 నుంచి గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ పునర్వికాస ఉద్యమానికి ఈనెల 15న శ్రీకాకుళంలో శ్రీకారం చుట్టనున్నారు. ఉద్యమ రాష్ట్ర కన్వీనర్ వల్లూరి శివప్రసాద్‌తోపాటు ప్రముఖ రచయితలు, కవులు, ప్రచురణకర్తలు కార్యక్రమానికి హాజరుకానున్నారని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నల్లి ధర్మారావు, చింతాడ కృష్ణారావు, సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం పేరుతో రాష్ట్ర స్థాయిలో కార్యాచరణ ప్రణాళికను జనవరి తొమ్మిదో తేదీన విజయవాడలో జరిగిన సదస్సు ఖరారు చేసిన విషయం విదితమే. గ్రంథాలయాల సెస్‌ను గ్రంథాలయ సంస్థల అభివృద్ధికే వినియోగించాలని, కొత్త పుస్తకాల కొనుగోలు, ముద్రణను ప్రోత్సహించాలన్నారు.

శ్రీకాకుళం రోడ్ రైల్వేకి మహర్దశ

(ఐదో పేజీ తరువాయి)

చేయనున్నారు. గతం కంటే ప్రస్తుతం ప్రయాణికుల సంఖ్య పెరగడంతో అన్ని రైల్వేస్టేషన్లను నూరు శాతం విద్యుదీకరణ చేయనున్నారు. కొత్తగా నడవనున్న వందే భారత్ రైళ్లను కూడా జిల్లాపై నుంచి వెళ్లేలా.. శ్రీకాకుళం రోడ్‌లో హాల్ట్ ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. రాష్ట్ర వ్యాప్తం గా 73 రైల్వేస్టేషన్ల ఆధునికీకరణలో శ్రీకాకుళం రోడ్ స్టేషన్ (ఆమదాలవలస) కూడా ఉంది. అలాగే కొత్తగా 50 నమో భారత్ రైళ్లు, 200 వందే భారత్ రైళ్లు, కొత్తగా వంద అమృత్ భారత్ రైళ్లకు ఆంధ్ర రాష్ట్రం లో నడిచేందుకు అనుమతి ఇస్తున్నట్లు రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ ప్రకటిం చారు. దీని వల్ల జిల్లా మీదుగా ఒడిశా, పశ్చిమ బెంగాల్‌కు వెళ్లే రైళ్ల వల్ల 'శ్రీకాకుళం రోడ్'కు మహర్దశ పట్టనుంది. దూర ప్రాంతాలకు మరిన్ని రవాణా సౌకర్యాలు మెరుగపడనున్నాయి. దీనిపై జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.